మిర్చి రైతు కంట్లో కారం

- తెగుళ్లతో దెబ్బతిన్న పంట
- ధరాఘాతంతో నష్టాల బాట

నందవరం: మిర్చి.. ప్రస్తుత వాణిజ్య పంటల్లో ప్రధానమైనది. ఈ పంటకు ప్రభుత్వం రిక్తహస్తం చూపింది. అసలే దిగుబడులు లేకున్నా గిట్టుబాటు ధరకు ఎగనామం పెట్టింది. మిరప రైతు కంట్లో కారం చల్లే పనిలో పడింది. నష్టాల బాటలో మిరప రైతు ఒరిగిపోతున్నా మిన్నకుండి వేడుక చూస్తోంది. ఓ వైపు తెగుళ్ల బెడద.. ఇంకోవైపు భారీగా తగ్గిన దిగుబడులు.. మరోవైపు ధరాఘాతం రైతన్నల పాలిట శాపంగా మారాయి. దీంతో నష్టాలు మూట గట్టుకుని మరోమారు కరువు వాకిట కునారిల్లారు. అప్పుల భారం మోయలేక నలిగిపోతున్నారు.


పొలంలో ఎండబెట్టిన మిరప దిగుబడులు

పంట సాగు వివరాలు

నందవరం మండలంలో పత్తి తర్వాత ప్రధాన పంట మిరప. ఇక్కడి రైతులు దాదాపు 2,665 హెక్టార్లలో హైబ్రిడ్ రకాల మిరప పంటలు సాగు చేశారు. మండలంలోని కనకవీడు, సోమలగూడూరు, ముగతి, జొహరాపురం, నదికైరవాడి, ఇబ్రహీంపురం, కొట్టాల, హాలహర్వి, పొనకలదిన్నె, నందవరం, మాచాపురం, పూలచింత తదితర గ్రామాల్లో అత్యధికంగా మిరప సాగు చేశారు.

భారీగా తగ్గిన దిగుబడులు

మిరప రైతును కొన్నేళ్లుగా తెగుళ్ల, నళి పురుగు, జెమిని వైరస్ వెంటాడుతూనే ఉంది. వాతావరణంలో మార్పుల కారణంగా బూడిద, పురుగు ధాటికి పైర్లు పచ్చదనాన్ని కోల్పోయాయి. జెమిని వైరస్‌ను నివారించేందుకు అన్నదాతలు రూ.వేలల్లో జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. ఏ పురుగు మందుకు నయం కాకపోవడంతో అప్పులు మిగిల్చుకుంటున్నారు. బూడిద ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా పైరును ఆశించడం రైతులను కలచివేస్తోంది. జెమిని వైరస్ కారణంగా పంట దిగుబడులు పతన స్థాయికి చేరాయి. ఎకరానికి 35 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 8–10 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. బూడిద కారణంగా మొక్కలు మొద్దుబారి పోయాయి.

గిట్టుబాటుకు చెల్లు చీటి

మిరప రైతులు కనీస మద్దతు ధర లభించక నష్టపోతూనే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో హైబ్రిడ్ రకాలకు రూ.20 నుంచి రూ.30 వేల వరకు ధర లభించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మిరపకు గిట్టుబాటు ధర కల్పించడంలో రిక్తహస్తం చూపుతోంది. డీలక్స్, బ్యాడిగ రకాలు క్వింటాలు రూ.8 నుంచి రూ.12 వేలు, కారం రకాలు కేవలం రూ.7 వేల నుంచి రూ.8 వేలకు మించి ధర పలకడం లేదు. పెట్టుబడులకు సైతం దిగుబడులు రాకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో దిక్కులు చూస్తున్నారు. ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడులు పెట్టుకున్నారు. పెట్టుబడి పెరగడానికి ప్రధాన కారణంగా తెగుళ్ల, నళ్లి ఆశించడం. పూర్తిగా నష్టపోయిన తమను ఆదుకోవాలని మిరప రైతు గగ్గోలు పెడుతున్నా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని వాపోతున్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోతే రైతుకు నష్టాల బాటేనని తీవ్ర ఆందోళన చెందుతున్నారు.


ఎండు మిర్చిని వాహనంలో మార్కెట్‌కు తరలిస్తున్న రైతు

భారీగా తగ్గిన ధర


ఈ ఏడాది మూడెకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. అనేక రకాల తెగుళ్ల వ్యాపించాయి. తెగుళ్లను నియంత్రించేందుకు ఎక్కువ పెట్టుబడులు పెట్టాం. పంట అనుకున్నంతగా రాలేదు. దిగుబడి దగ్గింది. అటు మిరపకు ధర పతనమైంది. ఆరుగాలం శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం మిరపకు మద్దతు ధర కల్పించాలి. – కురవ రామన్న, మిరప రైతు, నందవరం మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి


నాకున్న రెండున్నర ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. పంట మొదట్లో ఆశాజనకంగా ఉండటంతో పంట రక్షణ కోసం రూ.2 లక్షల వరకు ఖర్చు పెట్టుకున్నా. పంట చేతికొచ్చే దశలో తెగుళ్ల, నళి వ్యాపించి పంటంతా నాశనమైంది. 15 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. గత ప్రభుత్వంలో మిర్చి రూ.22 వేలు ధర లభించింది. ప్రస్తుత ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి.
– రాఘవ రెడ్డి, రైతు, నందవరం మండలం

16 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది


నాకున్న రెండు ఎకరాల్లో మిరప పంట వేశా. పంట సస్యరక్షణ కోసం రూ.2.20 లక్షలు వెచ్చించాను. పంటకు తెగుళ్ల ఆశించడంతో రెండు ఎకరాల్లో 16 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎండు మిర్చిని మార్కెట్‌కు తరలిస్తే రూ.10 వేలకు మించి ధర రావడం లేదు. దిగుబడి అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడం శోచనీయం.
– వీరేష్, రైతు, జొహరాపురం

మిర్చి రైతులను ఆదుకోవాలి


మిరప పైరుకు తెగుళ్ల, పురుగు ఆశించి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అటు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. మిరప సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారు. గత ప్రభుత్వ హయాంలో మిర్చికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.
– వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు

క్లుప్తంగా

ఈఈఎంటీలో ప్రతిభ


జ్యోత్స్న

నందవరం: మండల పరిధిలోని ముగతి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని యు.జ్యోత్స్న ఎడ్యుకేషన్ ఎపిఫనీ మోడల్ టెస్టు (ఈఈఎంటీ)లో ఉత్తమ ప్రతిభ కనబరించిందని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 7వ తరగతి విద్యార్థిని జ్యోత్స్న గత జనవరి 19న నిర్వహించిన ఈఈఎంటీ పరీక్షలో జిల్లాలో మూడవ ర్యాంక్ సాధించిందన్నారు. ఈ నెల 8న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.3 వేలు నగదు, ప్రశంసా పత్రం, మొమెంటో అంకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని జ్యోత్స్నను ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఘనంగా షబ్-ఏ-బరాత్

కౌతాళం: షబ్-ఏ-బరాత్ (పెద్దరాత్రి) వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు హాల్వి, బదినేహాల్, కుంటనహాల్, ఎరిగేరి, కామవరం, నదిచాగి, ఉప్పరహాల్ గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము 2 గంటల వరకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కౌతాళంలోని మదీనా మసీదులో మౌలానా అక్బర్‌అలీ మాట్లాడుతూ.. ఈ రాత్రి ప్రవిత్రమైనదని, ప్రవక్త మహమ్మద్ సొల్లాలాహు వలైహీ వసాల్లం ఈ రాత్రి గురించి గొప్పగా వివరించారని తెలిపారు. ఇలాంటి గొప్ప రాత్రి ప్రతి ముస్లిం తప్పక నమాజు ఆచరించాలన్నారు. రాత్రి 1 గంట వరకు బయాన్ నిర్వహించారు. అనంతరం ఖబరస్తాన్‌కు వెళ్లి దువా చేశారు. జామియా మసీదు, నూరానీ మసీదు, అక్సా మసీదు, దర్గాలోని ఖాదిరియా మసీదులో ప్రత్యేక పార్థనలు జరిపారు. ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ కౌతాళం మండల ప్రజలకు షబ్-ఏ-బరాత్ శుభాకాంక్షలు తెలిపారు.

దర్గాలో భక్తుల సందడి


ఖాదర్‌లింగ స్వామి సమాధికి పూజలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారంతో పాటు షబ్-ఏ-బరాత్ (పెద్దరాత్రి) కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక నమాజు ఆచరించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామంలో మండల ప్రజా పరిషత్ నిధులు రూ.8.40 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్ రెడ్డి, ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో సర్పంచ్ ఈరన్న సమక్షంలో పంచాయతీరాజ్ ఏఈ సయ్యద్ అబ్దుల్ మాలిక్ ఆధ్వర్యంలో భూమి పూజ చేసి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పనుల్లో నాణ్యత లోపించకుండా వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్, గ్రామస్తులు ఉన్నారు.

ఆకతాయి చేష్టలకు పాల్పడితే చర్యలు

గోనెగండ్ల: పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయి చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ గంగాధర్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం పాఠశాల, కళాశాల వదిలిన తర్వాత విద్యార్థులతో వెకిలి చేష్టలు చేస్తున్న ఇద్దరు ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ.. ఆకతాయిలు ప్రవర్తన మార్చుకోవాలన్నారు. విద్యార్థులను ఇబ్బంది పెడితే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అలాగే బైక్‌లపై అధిక శబ్దాలు చేస్తూ న్యూసెన్స్ చేస్తే ఇబ్బందులు తప్పవన్నారు. ఎవరైనా ఆకతాయిలు అల్లరి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

16 నుంచి అన్నదానం

ఆదోని అర్బన్: మహాశివరాత్రి పండగ సందర్భంగా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల దర్శనం కోసం వెళ్లే భక్తులకు ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అన్నదానం చేపట్టనున్నట్లు నిర్వాహకుడు మహర్షి విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. స్థానిక ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో వేదికను ఏర్పాటు చేసి పాదయాత్ర చేసే భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం శివపార్వతుల కళ్యాణోత్సవం అనంతరం పాదయాత్ర భక్తులకు అన్నదానం కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న రైల్వే ఇంజినీరింగ్ అధికారులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని నల్లగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ సిరాజ్‌అహ్మద్ గురువారం స్థల పరిశీలన చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేయడానికి వచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు ఇంజినీరును కలసి నల్లగేటు వద్ద బ్రిడ్జి లేకపోవడం ద్వారా ప్రయాణికుల రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు చెప్పారు. మార్కెట్లోకి, పట్టణంలోకి రావాలంటే రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి తిరిగి రావాల్సి ఉంటుందని వివరించారు. అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. స్పందించిన అధికారి స్థలం, బ్రిడ్జి నిర్మాణం వంటి అంశాలపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోసిగి: మండల కేంద్రం కోసిగి కడపాళెం 3వ వార్డు వాల్మీకి నగర్‌లో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ గృహసారథి కౌతాళం పార్వతి, నాగరాజు దంపతులకు మరోసారి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దాతృత్వం చాటుకున్నారని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే తరఫున వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్ రెడ్డి సహకారంతో బాధిత దంపతులకు ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ తాలుకా అధ్యక్షుడు నాడుగేని నాగరాజు చేతుల మీదుగా రూ.20 వేలు నగదును అందజేశారు. వారు మాట్లాడుతూ.. బాధితులు నివాసం ఉంటున్న గుడిసె ఈ నెల 7వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్ రెడ్డి ఎమ్మెల్యే తరఫున ఈ నెల 10వ తేదీన రూ.10 వేలు, రెండు జతల దుస్తులు అందజేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే సహకారంతో మరో రూ.20 వేలు నగదును అందించారు. దీంతో బాధితులు ఎమ్మెల్యేకు, జిల్లా కార్యదర్శికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు లోకారెడ్డి, విజయ్ కుమార్, అయ్యప్ప, ఈరెడ్డి ఉన్నారు.


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎంపీపీ ఈరన్న

క్షయ నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఆదోని సెంట్రల్: స్థానిక పురపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్షయవ్యాధి నివారణపై డాక్టర్ షేకున్‌బాను, డాక్టర్ అనీల్‌సాగర్ గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపు చారలు, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తుంటే తప్పకుండా గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పకుండా ఈ అంశాలను ఇంట్లో పెద్దలకు తెలియపరిచి తగు జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు. క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. వ్యాధి బారిన పడిన వారికి ఉచితంగా చికిత్స చేసి మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. టీబీ సిబ్బంది, ఎంపీహెచ్ఎస్ బాబురాజు, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిపై పనిభారం

ఆదోని రూరల్: ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది లేరని, ఉన్నవారిపై అధిక పనిభారం పడుతోందని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కె.మునెప్ప, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు అన్నారు. ఈ మేరకు గురువారం ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకప్పుడు ఆస్పత్రిలో వంద పడకలు ఉన్నప్పుడు కార్మికుల సంఖ్యనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారని, ప్రస్తుతం 350కు పైగా పడకల సంఖ్య పెరగడంతో కార్మికులపై పని భారం విపరీతంగా పెరుగుతోందన్నారు. కార్మికుల సంఖ్యను పెంచాలని, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కె.మునెప్ప

ఉద్యాన రైతులకు శిక్షణ


బొప్పాయి రైతులతో మాట్లాడుతున్న బనవాసి కేవీకే శాస్త్రవేత్త మౌనిక

ఆదోని రూరల్: ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఢణాపురం, పెద్ద తుంబళం గ్రామాల్లో కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వై.మౌనిక పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. కూరగాయలు, బొప్పాయి పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులను తెలియజేశారు. కూరగాయ పంటల్లో తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. తెల్లదోమ నివారణకు డైఫీంతురన్ 1.20 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పసుపు, నీలం రంగు జిగురు అట్టలు ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. బొప్పాయి పంటలో వచ్చే వైరస్, తెగుళ్ల నివారణకు తెల్లదోమ, పేనుబంక వంటి రసం పీల్చే పురుగులను అరికట్టాలన్నారు. వాటి నివారణకు డైమెతోయేట్ ఎంఎల్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.30 ఎంఎల్ లేదా అసెతమీప్రిడ్ 0.30 గ్రాములు ఏదైనా ఒక దాన్ని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఆదోని ఉద్యాన అధికారి బి.హరేంద్ర, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు రామకృష్ణ, గురుహరి, పార్వతిబాయి, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్


హాజరైన అంగన్‌వాడీలు, అధికారులు

ఆదోని రూరల్: బాల్యవివాహాల నిర్మూలనతో సమాజాన్ని కాపాడుకోవాలని, ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదోని డివిజన్ సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్, విద్యాశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాల నిర్మూలన మహిళా శిశు సంక్షేమ శాఖ బాధ్యత మాత్రమే కాదని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జీఓలు, గ్రామపెద్దలు సమన్వయంతో పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుందన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయాలన్న ఆలోచన తల్లిదండ్రులకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలని, వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి మనోధైర్యాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉండరని చెప్పారు. పేదరికం, వలసలు, మూఢ నమ్మకాలు, అభద్రతభావం, నిరక్షరాస్యత వంటి కారణాలతో బాల్యవివాహాలు జరుగుతున్నాయన్నారు. గ్రామ, మండలస్థాయి కమిటీలు నిర్వహించి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలో డ్రాపవుట్ అవుతున్న విద్యార్థులు వలసలు వెళ్లడం లేదా పెళ్లిళ్ల చేయడం జరుగుతున్నాయన్నారు. అలాంటి వారిని గుర్తించి బాల్యవివాహాల వల్ల నష్టాలను వారికి తెలియజేసి, చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి బడి బాట పట్టేలా కృషి చేయాలని ఎంఈఓలను ఆదేశించారు. అనంతరం అవగాహన పోస్టర్లను సబ్‌కలెక్టర్ ఆవిష్కరించారు.

గర్భిణులు, బాలింతలకు జాగ్రత్తలను వివరించండి

పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో అంగన్‌వాడీ వర్కర్స్ ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో.. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అవగాహన కల్పించారు. 0–6 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన ప్రాముఖ్యతను తల్లులకు తెలియజేయాలన్నారు. పిల్లల ఆరోగ్యం, ఎత్తు, బరువు క్రమం తప్పకుండా పరిశీలించి వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలన్నారు. ముఖ్యంగా గర్భిణిలకు రక్తహీనతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ సాధారణ ప్రసవం అయ్యేలా ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందజేయాలని, వారి ఆరోగ్య పరిస్థితులను ఆశావర్కర్, ఏఎన్ఎంలతో అనుసంధానంగా అంగన్‌వాడీ వర్కర్స్ మానిటరింగ్ చేయాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, సీడీపీఓలు ఉమామహేశ్వరి, సఫర్‌నిషా బేగం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దోమలను నివారించండి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో దోమలు విపరీతంగా ఉన్నాయని, వాటిని నివారించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.అయ్యన్న, సీనియర్ నాయకులు రామలింగప్ప కోరారు. ఈ మేరకు గురువారం పెద్దహరివాణం గ్రామంలో వారు పర్యటించారు. వారు మాట్లాడుతూ.. దోమల కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. చికిత్స కోసం ప్రయివేట్ ఆసుపత్రులు, ఆర్ఎంపీలను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందన్నారు. వెంటనే గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించాలని కోరారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం సీనియర్ నాయకులు రామలింగప్ప, అబ్బాస్, లక్ష్మన్న, నాగ తదితరులు ఉన్నారు.

కాంప్లెక్స్ సమావేశం వేళలు మార్చాలి

ఆదోని సెంట్రల్: పాఠశాలల సముదాయాల సమావేశం వేళల్లో మార్పులు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, పట్టణ అధ్యక్షుడు భీమారాజు గురువారం డిమాండ్ చేశారు. కాంప్లెక్స్ సమావేశాలకు వెళ్లే ఉపాధ్యాయులు ఉదయం 11.45 గంటల వరకు పాఠశాలలో పనిచేసి తిరిగి క్లస్టర్ సముదాయల సమావేశానికి వెళ్లడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఒక్కో క్లస్టర్ సమాదాయం పాఠశాలల నుంచి 20 - 30 కి.మీ. దూరం ఉంటుందన్నారు. భోజనం చేయలేక సమాయానికి చేరుకోవాలనే ఆత్రుతలో ఎదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. అధికారులు స్పందించి పాత పద్ధతిలో లేదా రోజంతా నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టీయూ నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు ప్రయోజనం లేని కేంద్ర బడ్జెట్

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్యులు, రైతులు, కౌలు రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సత్యన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు ఆరోపించారు. ఈ మేరకు గురువారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఏపీ ప్రజలు కేంద్ర బడ్జెట్‌పై పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, రాజధాని నిర్మాణ నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎంసీలను వినియోగంలోకి తేవాలి

గోనెగండ్ల: జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూఎంసీ) కేంద్రాలను ఈనెల 15వ తేదీ నుంచి వినియోగంలోకి తేవాలని డీపీఓ భాస్కర్ అధికారులకు సూచించారు. ఆయన గురువారం గోనెగండ్లలో ఎస్‌డబ్ల్యూఎంసీని పరిశీలించి సేంద్రియ ఎరువుల తయారీ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూఎంసీలు ఉన్నాయని, వీటన్నింటినీ వినియోగంలోకి తెచ్చి సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు అమ్మకాలు జరపాలన్నారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కింద ఈనెల 15వ తేదీ నుంచి జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గోనెగండ్లలో జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూఎంసీలకు తరలించి వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. గోనెగండ్ల ఎస్‌డబ్ల్యూఎంసీని ఆదర్శ కేంద్రంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే మార్చి 31లోపు ఇంటి, కొళాయి తదితర పన్నులను వంద శాతం వసూలు చేయాలన్నారు. వేసవి సమీపిస్తుండటంతో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ మణిమంజరి, ఈఓఆర్డీ అనంతసేన, సర్పంచ్ హైమవతి, కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


గోనెగండ్లలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీపీఓ భాస్కర్

రేపు విశ్వలింగేశ్వర స్వామి రథోత్సవం

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో వెలసిన విశ్వలింగేశ్వర స్వామి ఆలయ 43వ వార్షికోత్సవం సందర్భంగా మహా రథోత్సవం ఈనెల 15వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. గురువారం రథోత్సవ ఆహ్వాన పత్రిక పోస్టర్లను ఆలయ ప్రధాన అర్చకులు కె.ఈరన్న సమక్షంలో గ్రామస్తులు విడుదల చేశారు. 15న రథోత్సవం రోజున స్వామి వారికి వేకువజాము నుంచి రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, హోమం, గణపతి పూజ, నవగ్రహ రుద్రాభిషేకం, స్వాహాకార హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలో పార్వతి పరమేశ్వర కల్యాణ మహోత్సవం చేపడుతున్నట్లు తెలిపారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరులను రథంపై కొలువుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో స్వామి వారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథా స్థానానికి చేర్చనున్నట్లు తెలిపారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి


వాహనదారులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: వాహనాలను నడిపే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. ఈ మేరకు గురువారం విజిబుల్ పోలిసింగ్, వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టి వాహనదారుల వద్ద రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. రోడ్లపై వెళ్లేటప్పుడు నెమ్మదిగా వెళ్లాలన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. పోలీసు సిబ్బంది వెంట ఉన్నారు.